క్లుప్తంగా

ఆడుదాం ఆంధ్రా కిట్ల పంపిణీ


క్రీడాకారులకు కిట్లు అందిస్తున్న గోపాలకృష్ణ


గోపాలపట్నం: ఆడుదాం ఆంధ్రా కిట్లను ఆదివారం వైఎస్సార్ సీపీ 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ కొత్తపాలెంలో క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్రీడాకారుల్లో ప్రతిభగలవారిని వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. సచివాలయ స్థాయిలో పోటీల్లో విజేతలకు మండల స్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ ఆటల పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

బాక్సింగ్ పోటీల విజేతలకు సన్మానం


బాలికలను అభినందిస్తున్న పత్నిరావు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతానికి చెందిన కల్పిత, హర్షితలు ఇటీవల ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ స్థాయి బాలికల బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించారు. వీరిని గుల్లలపాలెంలో వాకింగ్ పార్కులో ఆదివారం వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి పత్నిరావు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ వెంకటేశ్వరరావు, ఆనందబాలు తదితరులు పాల్గొన్నారు.

చలపతిరావుకు మాజీ స్పీకర్ ప్రశంస


బుద్ధ ప్రసాద్‌కు తన రచనలను అందిస్తున్న రచయిత చలపతిరావు

మల్కాపురం: ప్రముఖ రచయిత సుంకర చలపతిరావు తన రచనలు, చిత్రాలు, కవితలతో ముద్రించిన పుస్తకాన్ని ఆదివారం నగరానికి వచ్చిన మాజీ స్పీకర్ బుద్ధ ప్రసాద్‌కు అందించారు. వాటిని చదివిన ప్రసాద్ ప్రశంసించారు. కార్యక్రమంలో చిత్రకారులు,పరిషత్ సభ్యులు సి.ఎస్.ఎన్.రాజు,శ్రీనివాస్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు గంజాయి నిందితులకు రిమాండ్

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా.. టాస్క్‌ఫోర్స్, ఐదో పట్టణ పోలీసులకు అందిన సమాచారం మేరకు సంయుక్తంగా దాడులు నిర్వహించగా తమిళనాడులోని మదురై ప్రాంతానికి చెందిన కాజా మైదీన్ ఇబ్రహీం, కర్నాటక బెంగుళూరుకు చెందిన మనీష్, చేతన్ కుమార్ అనే ముగ్గురు వ్యక్తులను ఊర్వశి జంక్షన్ వద్ద పట్టుకుని వారిని విచారించారు. అరకు నుంచి గంజాయిని బెంగుళూరుకు తరలిస్తున్నట్టు తేలింది. దీంతో వారి వద్ద నుంచి 5 కేజీల గంజాయి, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

జల్సాల కోసం..
విలాసాలకు అలవాటు పడి డబ్బు సంపాదించాలనే నెపంతో గుంటూరుకు చెందిన సింగు యోగేష్‌బాబు అనే యువకుడు తనకు కొత్తగా పరిచయమైన హనీష్ వర్మ అనే స్నేహితుడు ఇచ్చిన సలహా మేరకు గంజాయి విక్రయించాలనుకున్నాడు. ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం అతడు గంజాయి తరలిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్, ఐదో పట్టణ పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా జ్ఞానాపురం ఫ్లై ఓవర్ వద్ద యోగేష్‌బాబును పట్టుకుని విచారించారు. అరకులోని పరశురాం అనే వ్యక్తి వద్ద 6 కేజీల గంజాయి కొని గుంటూరు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. అతడి వద్ద నుంచి ఆరు కేజీల గంజాయి, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎస్.భాస్కరరావు మిగతా వ్యక్తుల కోసం కేసు దర్యాప్తు చేపట్టారు.


బౌలింగ్ చేస్తున్న కార్పొరేటర్ పి.వి.సురేష్


బ్యాటింగ్ చేస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

మేము ఆడితే..

- బ్యాట్ పట్టిన ప్రజాప్రతినిధులు
- రసవత్తరంగా సాగిన కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షుల ఫ్రెండ్లీ మ్యాచ్

మల్కాపురం: వారంతా ప్రజా **ప్రతినిధులు..** నిత్యం బిజీబిజీగా జీవనం **సాగిస్తుంటారు.** రాజకీయ వ్యూహాలు.. ప్రజల **తాకిడితో గడిపే** వీరంతా ఆదివారం బ్యాట్ **పట్టారు. తమ వయస్సును** మరిచి యువకుల వలే **మైదానంలో చెలరేగిపోయారు.** కార్పొరేటర్లు బౌండరీ **షాట్‌లు కొట్టి** వార్డు అధ్యక్షులను మైదానం చుట్టూ పరుగులు తీయించారు. సరదాగా సాగిన ఈ క్రికెట్ మ్యాచ్‌కు సంబంధించిన వివరాలు ఇలా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో గత నెల 21 నుంచి జింక్ మైదానంలో క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. దీనికి ముందు పశ్చిమ పరిధిలోని పలు వార్డుల కార్పొరేటర్లు,ఆయా వార్డుల అధ్యక్షులు,క్లస్టర్ అధ్యక్షులు,మాజీ కార్పొరేటర్ల మధ్య నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా జరిగింది. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కార్పొరేటర్లు పి.వి.సురేష్,బల్లా లక్ష్మణరావు,గుండపు నాగేశ్వరరావు,క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు పిల్లా కన్నబాబు,గల్లా శ్రీను, వార్డు అధ్యక్షులు ఆడారి హరీష్,భీశెట్టి గణేష్,నమ్మి శ్రీను,రేవళ్ల సత్యనారాయణ,చుక్క ప్రసాదరెడ్డి తదితరులు అద్భుతంగా ఆడారు. వీరిని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు మిలీనియం శ్రీధర్‌రెడ్డి, పశ్చిమ పార్టీ పరిశీలకుడు ఎస్.ఎ.రెహమాన్ అభినందించారు.


పోటీలో పాల్గొన్న కార్పొరేటర్లు, క్లస్టర్ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులను అభినందిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఆడారి ఆనంద్‌కుమార్

ఐఎన్‌సీఈఈ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా చిన్నారెడ్డి

కంచరపాలెం: ఇండియన్ నేవీ సివిలియన్ ఎంప్లాయీస్(ఐఎన్‌సీఈ) యూనియన్ నూతన ప్రధాన కార్యదర్శిగా బోరా చిన్నారెడ్డిని యూనియన్ సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు ఆదివారం నేవల్ ఏరియా అశోక్ పార్కులో ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఐఎన్‌సీఈ యూనియన్ మిత్రపక్షాలు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాశరావు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి శంకరరావు, ఐఎన్‌టీయూసీ గుమ్మిడి ఆదిమూర్తి అభినందించారు. ఉద్యోగులు, కార్మికులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోరా చిన్నారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సర్వసిద్ధి వెంకటరమణ, ఆర్ఎస్ నాయుడు, బి.అప్పలరాజు, ఆనంద్, బి.భోగేశ్వరరావు, రవి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.


బోరా చిన్నారెడ్డిని అభినందిస్తున్న యూనియన్ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు

మార్మోగిన గోవింద నామస్మరణ


పూజలందుకున్న వెంకన్న ఉత్సవమూర్తులు


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

- వైభవంగా సుదర్శన హోమం
- పూజల్లో పాల్గొన్న శ్రీశారదా పీఠాధిపతి, ప్రముఖులు
- వెంకటాద్రికి పోటెత్తిన భక్తజనం

పెందుర్తి: గోవింద నామస్మరణతో పెందుర్తి పులకించింది. భక్తజనంతో వెంకటాద్రి పోటెత్తింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వెంకటాద్రిపై సుదర్శన హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. భారీ ఎత్తున సామూహిక కుంకుమ పూజలు చేశారు. 22వ రోజు తిరుప్పావై పారాయణం చేశారు. అనంతరం పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో వెంకన్న దర్శనమిచ్చారు. అష్టోత్తర పూజ, మంగళహారతి ఇచ్చారు. గోపూజ, గోదాదేవి సన్నిధిలో వ్రతం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ సమక్షంలో వేదపండితులు శాస్త్రోక్తంగా సుదర్శన హోమం చేశారు. స్వామీజీ చేతుల మీదుగా పూర్ణాహుతి జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో దాదాపు 1500 మంది మహిళలు కుంకుమ పూజలు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి తీసుకువచ్చిన వివిధ రకాల పూలతో స్వామిని అభిషేకించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వేల మంది భక్తులు వెంకన్న ప్రసాదం స్వీకరించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవిందసత్యనారాయణ, బండారు సత్యనారాయణమూర్తి, కార్పొరేటర్లు ముమ్మన దేముడు, పీలా శ్రీనివాసరావు, సేనాపతి వసంత, పలువురు నాయకులు, అధికారులు, వేలాదిగా భక్తులు క్రతువులో పాల్గొన్నారు. ఈవో నీలిమ వెంకటాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. శ్రీవారి సేవకులు విశేష సేవలందించారు.

ఉత్సాహంగా కేరళీయుల క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలు


క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మధు


ఏసుక్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలిపే సెట్

మురళీనగర్: నగరంలోని కేరళీయులు క్రిస్మస్ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రతి ఏడాది జనవరిలో నూతన సంవత్సరంతోపాటు క్రిస్మస్ వేడుకలను బిర్లా కూడలిలోని కేరళ కళా సమితిలో నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి కళా సమితి అధ్యక్షుడు ఏఆర్‌జీ ఉన్నిత్తన్ అధ్యక్షతన నిర్వహించిన సంబరాల్లో సినీ రచయిత, దర్శకుడు ప్రొఫెసర్ మధు ఎరవాంకర పాల్గొని అందరికీ క్రిస్మస్, న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పారు. కొత్త ఏడాదిలో కేరళీయుల కుటుంబాలు ఉన్నత స్థానంలో ఎదగాలని ఆకాంక్షించారు. చర్చి ఫాదర్‌లు జోఫీ చిరయత్, బ్లెస్సన్ ఫిలిప్, జెటీ వర్గీస్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌వో ప్లాంట్‌ను ముఖ్య అతిథి మధు ఎరవాంకర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఏసు జనన వృత్తాంతం ఆకట్టుకుంది. క్రిస్మస్ గీతాలు అలరించాయి. థింసా నృత్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో కళా సమితి కార్యదర్శి కె.హరిదాస్, డాక్టర్ రేజీ థామస్, నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి కేరళీయులు పాల్గొన్నారు.

తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ రమేష్

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ ఎస్.రమేష్ ఒక్కొక్క రౌడీషీటర్‌ను విడివిడిగా కౌన్సెలింగ్ చేశారు. వారికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలని, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని నడుచుకోవాలన్నారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఆటోస్టాండ్ ప్రారంభం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు జనతాకాలనీ వద్ద శ్రీవెంకటేశ్వర జైదుర్గా ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ పేరిట ఏర్పాటు చేసిన ఆటో స్టాండ్‌ను ఎమ్మెల్యే పి.గణబాబు ఆదివారం ప్రారంభించారు. ఆటో కార్మికులకు ఏ ఇబ్బంది వచ్చినా తనను సంప్రదించాలని సూచించారు.

ముగిసిన హిస్టరీ కాంగ్రెస్ సదస్సు

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ వార్షిక సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ మాట్లాడుతూ కళాశాల ఆవరణలో హిస్టరీ కాంగ్రెస్ వార్షిక సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. పురావస్తు శాఖ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.తిమ్మారెడ్డి, ఏపీహెచ్‌సీ ప్రధాన కార్యదర్శి మొవ్వ శ్రీనివాస్‌రెడ్డి, ప్రొఫెసర్ సోమశేఖర్‌రావు ముగింపు ఉపన్యాసమిచ్చారు.

బ్యాటరీ సైకిల్ ర్యాలీ
కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం 50 బ్యాటరీ సైకిళ్లతో బుల్లయ్య కాలేజీ నుంచి ఆర్కే బీచ్ వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన మధుకుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు యువత కృషి చేయాలని, నూతనాలోచనలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జి.ఎస్.కె.చక్రవర్తి, డి.దీపక్ చౌదరి, కె.సోమేశ్వరరెడ్డి, ఎన్‌సీసీ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఏకాదశి ఆర్జిత సేవలు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వేడుకగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందరాజ స్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ ఘనంగా జరిగింది. వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని అధిష్ఠింపజేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు.

ముకుంద రచనలతో సాహిత్యానికి పట్టాభిషేకం


మాట్లాడుతున్న డాక్టర్ డి.వి.సూర్యారావు

మద్దిలపాలెం: ప్రపంచ సాహిత్యానికి యల్లపు ముకుంద రామారావు తన రచనలతో పట్టాభిషేకం చేశారని ప్రముఖ రచయిత, విమర్శకుడు డాక్టర్ డి.వి.సూర్యారావు అన్నారు. కళాభారతి ఆడిటోరియంలో అజో–విబో– కందాళం, రైటర్స్ అకాడమీ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ప్రతిభమూర్తి పురస్కార గ్రహీత యల్లపు ముకుంద రామారావు కృషి సమాలోచన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇజాలు, భావాల పట్ల పక్షపాతం లేదన్న విషయం అతని రచనలో కనిపిస్తుందన్నారు. సభాధ్యక్షుడు శ్రీధర్‌బాబు మాట్లాడుతూ వలస, వలస వేదనకు ఉన్న తేడాను వలస పోయిన మందహాసం కవిత్వం ద్వారా తెలిపారన్నారు. ప్రేమించడానికి తీరిక లేదు, ద్వేషించడానికి ఎక్కడ ఉందని ఆయన పేర్కొన్నారు. అంతే కాంతి అంశంపై డాక్టర్ కె.ఎస్.మల్లీశ్వరి మాట్లాడుతూ ఆ కాలపు భక్త కవులలో తీవ్రమైన భక్తి ఉందని, దీనిపై ముకుంద రామారావు పరిశోధన చేశారన్నారు. కాకినాడకు చెందిన మాకినీడు సూర్య భాస్కర్ మాట్లాడుతూ ఎవరూ చేయని పనిని రామారావు తన సాహిత్యంలో చేసి చూపించారన్నారు.

మళ్లీ మళ్లీ ఇది రాని రోజు


మల్కాపురంలో 36 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మల్కాపురం: వారంతా 36 ఏళ్ల కిందట ఒకే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు. నేడు వేరు వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. నాటి విద్యార్థులైన బంక సంజీవ్, ముప్పిడి వెంకటగిరి ఆలోచనతో ఆదివారం ఓ చోట చేరి సందడి చేశారు. వీరి అపూర్వ కలయికకు మల్కాపురం వేదికైంది. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం పాఠశాలలో **1986–87లో పదో** తరగతి చదివిన విద్యార్థులే **వీరంతా. చాలా ఏళ్ల** తర్వాత ఒకరినొకరు చూసు**కున్న స్నేహితులంతా** ఆప్యాయంగా పలకరిం**చుకుని పాత జ్ఞాప**కాలను నెమరవేసుకున్నారు. **తాము చదువుకున్న** పాఠశాల వద్దకు వెళ్లి పరిసరా**లను చూసి పులకిం**చారు. స్థానిక సాగరదుర్గా బీచ్ వద్ద వేదిక ఏర్పాటు చేసుకుని వీరంతా సందడిగా గడిపారు. ప్రస్తుత వయసును మరిచి ఆటపాటలతో సాయంత్రం వరకు సరదాగా కాలక్షేపం చేశారు.

33,286 మందికి కంటి శస్త్ర చికిత్సలు

శంకర్ ఫౌండేషన్ డీజీఎం బంగార్రాజు


శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి

సింహాచలం: నేత్ర వైద్య సేవల్లో నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి అద్భుత పనితీరు కనబరుస్తోందని ఆస్పత్రి డీజీఎం కె. బంగార్రాజు తెలిపారు. 2023లో నిర్వహించిన శస్త్ర చికిత్సలు, ఇతర వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. 2023లో 33వేల 286 కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించినట్టు తెలిపారు. 1997లో ఆస్పత్రి స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు 4లక్షల 33వేల 286 కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించిందని తెలిపారు. రెటీనా, గ్లకోమా,కార్నియా వంటి ప్రత్యేక కంటి శస్త్ర చికిత్సల్లో ఉత్తమ ప్రగతి సాధించిందన్నారు. డాక్టర్ వైఎస్సార్‌సీ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 58 శాతం పైగా రోగులకు కంటి వైద్య సేవలు అందించామన్నారు. 2023లో గ్లకోమా నివారణకు ఒక రోగికి గ్లకోస్ ఐస్టంట్ శస్త్ర చికిత్స తొలిసారిగా నిర్వహించి రికార్డు సృష్టించినట్టు తెలిపారు. గాజువాక బీసీ రోడ్డులో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో సేవలు సంక్రాంతి నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా అంధత్వ నివారణకు శంకర్ ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తోందని తెలిపారు.

69 మద్యం బాటిళ్ల స్వాధీనం


టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న డిఫెన్స్ మద్యం బాటిళ్లు

మల్కాపురం: అనధికారికంగా తన ఇంట్లో మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న ఓ నేవల్ రిటైర్డ్ అధికారిని టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకుని, బాటిళ్లను స్వాధీనం చేసుకుని మల్కాపుం పోలీసులకు అప్పగించారు. వివరాలిలా.. 60వ వార్డు బర్మా కాలనీ వద్ద పి.వి.ఆర్. రెసిడెన్సీలోని ఫ్లాట్ నంబర్–301లో ఓ నేవల్ విశ్రాంతి ఉద్యోగి సుమారు 69 డిఫెన్స్ మద్యం బాటిళ్లు నిల్వ ఉంచారు. దీనిపై సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు సిబ్బంది సాయంతో ఆదివారం సాయంత్రం ఆయన ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో గల మద్యం బాటిళ్లపై ఆరా తీశారు. దీనిపై పొంతన లేని సమాధానం చెప్పడంతో ఆ వ్యక్తిని మల్కాపురం పోలీసులకు అప్పగించి, అతడి వద్ద గల 69 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మల్కాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నవ్వుల్లో ముంచెత్తిన హాస్యావధానం


హాస్య అవధానం చేస్తున్న కామెడీ క్లబ్ కళాకారులు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ వినూత్నంగా నిర్వహించిన హాస్యావధానం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వేదికగా వినోదాల విందులో భాగంగా అవధాన కార్యక్రమం నిర్వహించారు. జె.ఎల్.నరసింహం (అవధాని) , కామేశ్వరరావు(చమత్కార కవి, అప్రస్తుతం), ఎం.వి.సుబ్రహ్మణ్యం(సమన్వయం) పాల్గొన్నారు. పృచ్ఛకులుగా నందూరి రామకృష్ణ(సందేశం), డాక్టర్ రజని(దత్తపది) జబర్దస్త్ ప్రకాష్(ఆశువు), డేవిడ్‌రాజు(పేరడీ), శివజ్యోతి (వర్ణన), తులసి గణేష్(విచిత్ర అంశం) పాత్రలు పోషించారు. సంధ్యా ప్రియదర్శిని, ఎస్.ఎస్.నాయుడు, సభికులు కురిపించిన ప్రశ్నలకు అవధాని హాస్యం జోడించి చెప్పిన సమాధానాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. తిలక్ పట్నాయక్, మాల్యాద్రి, పురుషోత్తం, సన్‌మూర్తి, దాడి సత్యనారాయణ అతిథులుగా పాల్గొని కళాకారులను ఘనంగా సత్కరించారు. ఇటీవల రెండు సార్లు ఉత్తమ హాస్య నటుడిగా నంది అవార్డు అందుకున్న డేవిడ్‌రాజును సన్మానించారు. ఇక నుంచి ప్రతి నెలా ఒక హాస్య నటుడికి రేలంగి ఆత్మీయ సత్కారం చేసి, వార్షికోత్సవంలో రేలంగి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేస్తామని ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ప్రకటించారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన


శాంతినగర్ జంక్షన్ వద్ద పారిశుధ్య కార్మికులను అడ్డుకుని సర్ది చెబుతున్న పోలీసులు

గోపాలపట్నం: జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఇంటి వద్ద ఆందోళన చేపట్టేందుకు కొంత మంది పారిశుధ్య కార్మికులు ఆదివారం సిద్ధమయ్యారు. అయితే పోలీసులు జోక్యం చేసుకుని కార్మికులకు నచ్చజెప్పడంతో వారు వెనుదిరిగారు. 52వ వార్డులో చెత్త పేరుకుపోవడంతో ఆయన శ్రమదానంతో ఎత్తి తరలించారు. ఈ నేపథ్యంలో కొందరు కార్మికులు డంపర్ బిన్లకు మంటపెట్టారు. కొన్ని చోట్ల పబ్లిక్ ట్యాప్‌లు విరిచారు. దీంతో కొందరిని డిప్యూటీ మేయర్ మందలించారు. దీనిపై కొందరు తప్పుడు ప్రచారం చేయడంతో కార్మికులు అపార్థం చేసుకుని జియ్యాని ఇంటి ముందుకు ధర్నాకు యత్నించారు. గోపాలపట్నం సీఐ సంతోష్ కుమార్, ఎయిర్‌పోర్టు సీఐ బీఎండీ ప్రసాద్, ఎస్ఐ రామకృష్ణ, గోపాలపట్నం ఎస్ఐ అప్పలనాయుడు నిరసన తెలపడానికి వచ్చిన 10 మంది కార్మికులకు సర్దిచెప్పి వెనక్కి పంపించారు.

కార్మికులు నా కుటుంబ సభ్యులతో సమానం
ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీధర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులంతా తమ కుటుంబ సభ్యులు వంటి వారన్నారు. సమ్మెకు తాను అడ్డు పడలేదని ప్రజలకు అసౌకర్యంగా ఉన్న ప్రాంతాల్లో మాత్రమే శ్రమదానంతో శుభ్రం చేశామని తెలిపారు. దీంతో కొందరు కార్మికులు ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడంతో తన అనుకున్న వారిని మందలించానని చెప్పారు. వారిపై తనకున్న చనువుతో మాత్రమే చెప్పానన్నారు. దీనిపై ఆ కార్మికుల కుటుంబ సభ్యులు కూడా తనతో మాట్లాడారని, వారు చేసిన పనులు వీడియోలో చూపించానని తెలిపారు. కార్మికులకు ఎప్పుడూ తన సహకారం ఉంటుందని జియ్యాని చెప్పారు.

నేడు ముగ్గుల పోటీలు

మురళీనగర్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ ఆవరణలో వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు పొందూరి ప్రభావతి తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారితో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక బహుమతులు అందిస్తామని చెప్పారు. పోటీలో పాల్గొనే వారు ముగ్గు పిండి, సామగ్రి వారే తెచ్చుకోవాలన్నారు. వివరాలకు 90901 87148 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.